క్లుప్తంగా

రాయితీపై జీలుగ విత్తనాలు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ ఐకేపీ గ్రామైఖ్య సంఘం ఎరువులు, విత్తన డీలర్ ఆధ్వర్యంలో సబ్సిడీపై పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు అందించనున్నట్లు ఎంఏఓ ప్రణీత బుధవారం తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఈనెల 22న ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్కులతో విలాసాగర్ రైతువేదికలో సంప్రదించాలని కోరారు. పచ్చిరొట్ట జీలుగ విత్తనాల 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.4,725 కాగా, 50 శాతం సబ్సిడీ రూ.2137 చెల్లించి జీలుగ విత్తనాలు తీసుకోవాలని ఎంఏవో ప్రణీత కోరారు.

తంగళ్లపల్లి: మండల రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కె.సంజీవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని తేజశ్రీ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో గురువారం జీలుగ విత్తనాలు అందజేస్తామని అన్నారు. సబ్సిడీపై రూ.2138 ఒక్కో బస్తాకు చెల్లించాలన్నారు. మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎం సురేశ్‌రెడ్డి బుధవారం తెలిపారు. రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డుతో గురువారం ఉదయం 10 గంటలకు మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో టోకెన్ తీసుకొని జీలుగు విత్తనాలు తీసుకోవచ్చన్నారు.

కుట్ర పూరితంగానే మాజీ సీఎంకు నోటీసులు



మాట్లాడుతున్న సిద్ధం వేణు

ఇల్లంతకుంట: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కమీషన్లు వేసి కుట్రపూరితంగా మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు సరికాదని జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. బుధవారం మండలంలోని పొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. కుట్రపూరితమైన ఆలోచనలు ప్రభుత్వం మానుకోవాలని, ఆరు గ్యారంటీలను అమలుచేయలేకనే మరొకటి తెరపైకి తెచ్చిందన్నారు. ఇక్కడ కుదురు శేఖర్, బండారి మహేశ్, గుంటి మహేశ్, సిద్ధంసాగర్, కోల రాజు తదితరులున్నారు.

సన్నాల బోనస్ ఖాతాల్లో జమచేయాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో సన్నవడ్లు కొనుగోలు ప్రక్రియ ప్రారంభమై నెల రోజులు పూర్తవుతున్నా రైతులకు బోనస్ డబ్బులు వారి ఖాతాల్లో జమకావడం లేదని బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో వర్షాకాలం పంటకు సన్నాలు వేయాలా.. వద్దా అని రైతులు అయోమయానికి గురవుతున్నారన్నారు. అధికారులు రైతుల సన్నవడ్ల డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

నిధులు మంజూరు



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట: మండలంలోని పత్తికుంటపల్లి గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ ఫంక్షన్ హాల్ అసంపూర్తి పనులకు బుధవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రూ.30 లక్షలు మంజూరు చేశారు. ప్రొసిడింగ్ కాపీని మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య యాదవ్‌కు అందజేశారు. డీఎంఎఫ్‌టీ నుంచి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే భాస్కర్ రెడ్డి, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏలేటి మాధవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి, శ్రీనివాసరెడ్డి, తిరుపతి రెడ్డి, తదితరులు ఉన్నారు

ఎంపీడీవో విచారణ

చందుర్తి: మండలంలోని పలుగ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు ఇళ్ల కేటాయింపుపై ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూల ఆధ్వర్యంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. కాగా వీటిలో భవనాలు ఉన్నవారికి ఇళ్లు మంజూరుచేశారన్న ఆరోపణల మేరకు మండలంలోని నర్సింగాపూర్, రామన్నపేట, బండపల్లి గ్రామాల్లో అధికారులు బుధవారం అనర్హులను గుర్తించి నివేదికను మండల ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి పాటు కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రి గ్రామంలో గ్రామస్తులు పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఇంటింటా బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ అమ్మవారి ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కులస్తులు, గ్రామ పెద్దలు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా తిరుగుతూ.. అవగాహన కల్పిస్తూ



ఇంటింటా స్టిక్కర్లు అంటిస్తున్న మున్సిపల్ సిబ్బంది



స్ప్రే చేస్తున్న సిబ్బంది

- పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం
- డెంగీ కేసులు పెరుగుతున్న క్రమంలో ఇంటింటా అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది
- వారం రోజులు కార్యక్రమం కొనసాగింపు

వేములవాడ: డెంగ్యూపై మున్సిపల్ సిబ్బంది నడుం బిగించారు. బుధవారం పట్టణంలోని 28 వార్డుల్లో ఏకకాలంలో పనులు చేపట్టారు. పారిశుధ్యం సక్రమంగా చేపడితే వ్యాధులు దరిచేరవని తెలపుతూ పట్టణంలోని వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది ప్రజల్ని చైతన్య పరిచారు. ఇటీవల జిల్లాలోని కంచర్ల గ్రామంలో 30 మందికి డెంగ్యూ పాజిటివ్ రావడంతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సీరియస్‌గా తీసుకుని జనాభా ఎక్కువ ఉన్న వేములవాడలో ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. దీంతో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఇంటింటి తిరుగుతూ.. నిల్వ నీరు ఉంటే కలిగే వ్యాధులపై యజమానులకు అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు సిబ్బంది పట్టణంలో అవగాహన కల్పించనున్నారు.

మంగళ, శుక్రవారం డ్రైడే

ప్రభుత్వం ప్రకటించే డ్రై డే ప్రతీ మంగళ, శుక్రవారాలు నిరంతరంగా కొనసాగుతుందని వివరించారు. డెంగ్యూ కేసులు పెరుగుతున్న క్రమంలో వాటి నివారణకు డ్రై డే వంటి చర్యలు ప్రజల్లో స్వీయ నియంత్రణ భావనను పెంపొందించే దిశగా ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ వార్డులో వార్డు అధికారిని నియమించడం, ప్రతి ఇంటిలో ఉన్న లార్వా నీరును శుభ్రపర్చి స్ప్రే చేయడం, నిల్వనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం లాంటి చర్యలు కొనసాగనున్నాయి.

పట్టణంలో వార్డులు, సిబ్బంది	
మున్సిపల్ వార్డులు	28
నివాసాలు	1468
వార్డు ఆఫీసర్లు	28
వాటర్ మెన్స్	28
ఆశావర్కర్లు	56
మెప్మా సిబ్బంది	28

నిరంతరం కొనసాగాలి



దోమలవాప్తి పెరుగుతోంది. మున్సిపల్ చేపట్టిన ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగించాలి. ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి. మురుగునీటి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి

– రేగుల రాజ్‌కుమార్, మహాలక్ష్మివీధి, వేములవాడ

పకడ్బందీగా నిర్వహిస్తున్నాం



వేములవాడలోని 28 వార్డుల్లో ఈ ప్రక్రియ వారం రోజులపాటు చేపడుతున్నాం. ఇంటింటా అవగాహన కల్పిస్తున్నాం. వారం తర్వాత ప్రతీ మంగళ, శుక్ర వారాలు డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



ఎల్లారెడ్డిపేట: మాట్లాడుతున్న ఎంఈవో కృష్ణహరి



బోయినపల్లిలో..

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని మండల విద్యాధికారి కృష్ణహరి అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణలో భాగంగా శిక్షణ తరగతులను ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ తిరుపతి, సతీశ్, ప్రశాంత్, రమేశ్, పూర్ణచందర్, భూమేశ్, ప్రవీణ్, శ్రీకాంత్, సీఆర్పీలు రాజు, శ్రీనివాస్, ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని హైస్కూల్‌లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఎంఈవో ఎస్.శ్రవణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 25 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఏవీఎస్‌లపై శిక్షణ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం కలిగేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని సూచించారు. జిల్లా, మండల రిసోర్స్ పర్సన్లు కే.శ్రీనివాస్, స్వరాజ్యలక్ష్మి, ఎస్.కనుకయ్య, బీ.చెంద్రశేఖర్, వీ.జగన్‌మోహన్, పీ.రవికుమార్, హెచ్.సురేంద్రస్వామి, బీ.కుమారస్వామి, శ్రీనివాస్, నరేందర్, టీపీఎస్ ఎస్.చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు తమ నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల రిసోర్స్ పర్సన్ ఉపాధ్యాయులు జి సందీప్‌రెడ్డి, కే హరిందర్ రెడ్డి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి భూక్య రాజు నాయక్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు శిక్షణ ఉంటుందని నూతన విద్యా విధానంలో కొత్త మెలుకువలు నేర్చుకొని విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు.

ఆంక్షలు లేకుండా ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు ఇవ్వాలి



చందుర్తి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు బీజేపీ జిల్లా నాయకులు, మాజీ ఉపసర్పంచ్ సిరం తిరుపతి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న ప్రతివారికి బిల్లులు చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చారన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రకటించిన నిబంధనలను సడలించి , అనుమతులు ఇవ్వాలని కోరారు. 400 చదరపు అడుగుల నుంచి 600 అడుగులలోపు నిర్మించుకోవాలన్న నిబంధనలతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుంది. ఎల్లారెడ్డిపేట మండల వైద్యాధికారి సరియా అంజుమ్ అధ్వర్యంలో 78 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.



కొండగట్టుకు తరలిన హనుమాన్ దీక్షాపరులు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని 21 మంది హనుమాన్ దీక్షాపరులు కాలినడకన కొండగట్టు ఆలయానికి బయలుదేరి వెళ్లారు. గురువారం హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా దీక్షాపరులు నర్ర శ్రీనివాసరెడ్డి, మామిడి సంజీవ్, శ్రావణ్ కుమార్, రామకృష్ణ, హరికృష్ణ ,మధు, బాబు, తదితరులు తరలివెళ్లారు.

కంటి చూపే చాలు

- ఐదు పదులు దాటినా కళ్లద్దాలు లేవు !
- అలవోకగా పనులు చేస్తున్న కార్మికులు, కర్షకులు
- జీవనశైలి..ఆహారపు అలవాట్లతో మంచి కంటిచూపు

బోయినపల్లి: చిన్నారులు మొదలుకొని ఇరవై ఏళ్ల వయస్సున్న యువకులు పలువురు కళ్లద్దాలు లేకపోతే ఇబ్బంది పడుతున్నారు. నలబై ఏళ్లలోనే పలువురికి చూపు మందగిస్తోంది. కంప్యూటర్ యుగంలో సైతం పలువురు ఆరు పదులు దాటినా కళ్లద్దాలు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. దురలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడమే ఇందుకు కారణమని వారు చెబుతున్నారు. ఎక్కువగా ఆకు కూరలు, పాలు, పండ్లు, గుడ్లు ఉండేలా చూసుకోవడంతో తమకు కళ్లద్దాలు వాడే అవసరం రాలేదని పలువురు తెలిపారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిత్యం కంప్యూటర్‌తో కుస్తీ పట్టే ఉద్యోగులు కూడా కళ్లద్దాల వాడకం లేకుండానే తమ విధులు నిర్వహిస్తున్నారు.



రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కంప్యూటర్‌తో కుస్తీ పట్టే పొటోలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి ఎంపీ. స్వామి బోయినపల్లి సబ్‌పోస్టు ఆఫీస్‌లో సబ్ పోస్టు మాస్టర్ (ఎస్‌పీఎం) గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటికీ కళ్లద్దాలు వాడే అవసరం రాలేదని చెబుతున్నారు. సెల్ ఎక్కువగా చూడకపోవడం తన అలవాటు అని చెప్పారు స్వామి.



డెబ్బై ఐదేళ్ల వయస్సులో కళ్లద్దాలు లేకుండా చింతపండు కొడుతున్న ఈ వృద్ధురాలి పేరు బోనాల ఎల్లమ్మ. బోయినపల్లికి చెందిన ఎల్లమ్మకు బీపీ, షుగర్ లాంటి ఎలాంటి జబ్బులు లేవు. గోలీలు వాడే అలవాటు లేదు. ఈమె తన పనులు తానే స్వయంగా చేసుకుంటూ ఇరుగు పొరుగు వారికి సాయంగా ఉంటుంది. తమ చేనులో వ్యవసాయ పనులకు వెళ్తుంది. చింతపండు కొట్టడంతో పాటు, బియ్యం చెరగడం తదితర పనులు అలవోకగా చేస్తుంది. చిన్నప్పటి నుంచి గట్క, అంబలి తిని పెరిగానని, అందుకే అన్ని పనులు సులువుగా చేస్తానని చెప్తోంది ఎల్లమ్మ.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో మురుగుకాల్వలు కంపుకొడుతున్నాయి. దుర్వాసనతో గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నా అధికారులకు పట్టింపు లేదు. కొంత కాలంగా మురుగుకాలువల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచుల పదవి కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. ప్రత్యేకాధికారులు కనీసం గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. గ్రామంలోని చాలావార్డుల్లో మురుగుకాలువల పరిస్థితి ఇలాగే ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. వెంటనే మురుగుకాలువలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
జాఫర్, పంచాయతీ కార్యదర్శి, నారాయణపూర్: సెల్‌నంబర్: 9640832448

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



తంగళ్లపల్లి : సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, మచ్చ శ్రీనివాస్, ఎగుర్ల ప్రశాంత్, పెద్దూరి తిరుపతి తదితరులున్నారు.

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి గ్రామానికి చెందిన కుదుకల కవితకు రూ.34 వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కును ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ బుధవారం అందజేశారు. ఇక్కడ ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళి, మదన్‌లాల్, నర్సింగం, యూత్ మండల అధ్యక్షుడు తిరుపతి, మండల నాయకులు శివ రామ కృష్ణ, కాంతయ్య, సంతోష్, శ్రీనివాస్,కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని.. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సోషల్ స్టడీస్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఎమ్మెస్సీ, బీఈడీ అర్హత కలిగిన వారు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించేందుకు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8688912738, 9949757365 నంబర్లలో సంప్రదించాలని ఈసందర్భంగా కోరారు.



వేములవాడరూరల్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బోయినపల్లి: తడగొండలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రాజీవ్‌గాంధీకి నివాళి

వేములవాడ రూరల్/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/కోనరావుపేట/గంభీరావుపేట/తంగళ్లపల్లి/రుద్రంగి/వీర్నపల్లి: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించరా ?



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, కావాలని అధికారులు రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపత్రాల పంపిణీలో సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ ఫోటోను ఫ్లెక్సీపై పెట్టకపోవడం, కనీసం కార్యక్రమానికి సంబంధించిన సమాచారం అధికారులు ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. పదేళ్లలో నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేటీఆర్‌ను అధికారులు మర్చిపోవడం హాస్యాస్పదమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు ఎడ్ల సందీప్, నమిలికొండ శ్రీనివాస్, కిషన్, దేవరాజు, శ్రీనివాస్, సుధాకర్‌రావు, వెంకట్‌రెడ్డి, మురళీగౌడ్, సీత్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న గుడి చెరువులో రెండు మృతదేహాలు లభ్యం

వేములవాడ: వేములవాడ రాజన్న గుడి చెరువులో బుధవారం రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను వెలికితీశామని, మృతుల్లో ఒకరు 55 నుంచి 60 ఏళ్ల మధ్య, మరొకరు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉండవచ్చన్నారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

టీఎస్‌ఆర్జేసీలో ప్రతిభ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్ హైస్కూల్ విద్యార్థులు టీఎస్‌ఆర్జేసీ ఫలితాల్లో ప్రతిభ చూపారు. గుండ్ల అక్షయ బైపీసీలో రాష్ట్ర స్థాయి 38వ ర్యాంకు సాధించింది. ఎంపీసీలో న్యాలపెల్లి నాగవర్షిణి 176, దండు సవిత 195, జిల్లెల్ల ఐశ్వర్య 429, చెక్కల సింధు 645, చెక్కల ఇందు 801వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా వీరిని స్కూల్ హెచ్ఎం, ఎంఈవో కృష్ణహరి అభినందించారు.